హుండీల ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం హుండీలకు లెక్కించగా రూ.50, 24,653 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. 77 అమెరికా డాలర్లు, దిరామ్స్ 1, యురోస్ 230, సైది దినార్స్ 48, బంగారం 11 గ్రాములు, 2 కిలోల 185 గ్రాముల వెండి రూపంలో వచ్చినట్లు చెప్పారు. లెక్కింపులో ఆలయ కార్య నిర్వాహణ అధికారి బి.కృష్ణ, ఫౌండర్ ఛైర్మన్ సాయిబాబాగౌడ్, దేవాదయ శాఖ అధికారులు దాతలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

సనత్‌నగర్: ఏఐసీసీ సభ్యురాలు, కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ జన్మదినం సందర్భంగా బేగంపేట ఓల్డ్ కస్టమ్స్‌బస్తీ కమ్యూనిటీ హాల్‌లో గురువారం ఉదయం 10 గంటలకు రక్తదానం శిబిరం నిర్వహించనున్నారు. యూత్ కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరానికి కోట నీలిమతో పాటు సీనియర్ నేత విశాల్ సూదం, మోత రోహిత్, శివచరణ్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు కాంగ్రెస్ ప్రతినిధులు తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం



అహమ్మెదీబేగం

చిలకలగూడ : మెడికల్ దుకాణానికి వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడకు చెందిన అహమ్మెదీబేగం (70) అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈనెల 12న రాత్రి మందులు కోసం సమీపంలోని మెడికల్ దుకాణానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త మహ్మద్ గఫూర్‌షరీఫ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉరేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

సనత్‌నగర్: ఉరేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..వరంగల్ చిట్యాల్‌కు చెందిన పాలవెల్లి శ్రీనాథ్ (35) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. 2020లో జోత్స్న అనే యువతిని వివాహం చేసుకుని మోతీనగర్‌లోని ఎస్‌పీఎస్‌బీకేఎం హైట్స్‌లో ఉంటున్నారు. ప్రస్తుతం వీరికి ఓ బాబు ఉన్నాడు. జ్యోత్స్న తన సోదరుడి వివాహం ఉండడంతో పుట్టింటికి వెళ్లింది. ఒంటరిగా ఉన్న శ్రీనాథ్ తన సోదరుడు శ్రీకాంత్‌తో కలిసి ఈ నెల 12న ఓ కార్యక్రమానికి వెళ్లివచ్చారు. మరుసటి రోజు మంగళవారం ఉదయం 9 గంటలకు సోదరుడు శ్రీకాంత్ బైక్ తాళాల కోసం శ్రీనాథ్ ఇంటికి వచ్చి తలుపు తట్టగా ఎంతకీ తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపు పగులగొట్టి చూడగా శ్రీనాథ్ సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కిందికి దించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

కంటోన్మెంట్‌లో ఎవరి ఆట వారిదే!

- కబ్జాకు గురైన క్రీడామైదానాలు
- స్వాధీనానికి బోర్డు అధికారుల యత్నాలు
- హాకీ మైదానం అభివృద్ధికి ముందుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- పదేళ్లుగా స్పందన లేని వైనం



బైసన్ పోలో మైదానాన్ని చదును చేస్తున్న కంటోన్మెంట్ బోర్డు అధికారులు

కంటోన్మెంట్: క్రీడాకారులకు పుట్టినిల్లుగా పరిగణించే సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో క్రీడా ప్రాంగణాలే కరువయ్యాయి. సుమారు వంద ఎకరాల్లో క్రీడా మైదానాలు ఉన్నప్పటికీ నిరుపయోగంగా ఉన్నాయి. భారత హాకీ జట్టు కెప్టెన్ ముఖేశ్ కుమార్, మహిళా క్రికెట్ మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, బ్యాడ్మింటన్‌లో ఒలింపిక్ పతకం సాధించిన పీవీ సింధూ.. బ్రిటీష్ హయాం, స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో అంతర్జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ ఆడిన క్రీడాకారులెందరో ఇక్కడే ఆయా క్రీడల్లో ఓనమాలు దిద్దుకున్నారు. ఒకప్పుడు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్ మైదానాలు కలిగిన ఈ ప్రాంతంలో ప్రస్తుతం మైదానాలే లేకుండా పోయాయి. పాలకుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపాలతో క్రీడాకారులకు కనీస సదుపాయాలు కూడా కల్పించలేని దుస్థితి నెలకొంది. పదుల ఎకరాల్లో క్రీడా మైదానాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయి. వీటిని కబ్జాల చెర నుంచి విడిపించి క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాల్సిన అధికారులు ఏళ్ల తరబడి చేష్టలుడిగి చూస్తున్నారు. ఎట్టకేలకు కంటోన్మెంట్ బోర్డు అధికారులు ఆయా స్థలాలను తిరిగి క్రీడల కోసం అభివృద్ధి చేసేందుకు చేపడుతున్న చర్యలకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి.

ఆర్మీ ఆధీనంలో బైసన్ పోలో..

కంటోన్మెంట్‌లోని మిలటరీ పరేడ్ గ్రౌండ్స్‌ను ఆనుకుని జింఖానా, బైసన్ పోలో మైదానాలు ఉన్నాయి. బ్రిటీష్ జమానా నుంచి ఆయా మైదానాలు స్థానిక క్రీడాకారులకు అందుబాటులో ఉండేవి. జీఎల్ఆర్ సర్వే నెంబర్ 708లోని సుమారు 37 ఎకరాల బైసన్ పోలో మైదానాన్ని ఆర్మీ పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుంది. ఇందులో సుమారు 8 ఎకరాలను ఎన్‌సీసీ డైరెక్టరేట్ వినియోగించుకుంటోంది. ఈ క్రమంలో 1996లో కేంద్రం బైసన్ పోలో మైదానాన్ని పూర్తిగా క్రీడలు, సాంస్కృతిక అభివృద్ధికి వినియోగించాలని సూచిస్తూ ఆర్మీ నుంచి కంటోన్మెంట్ బోర్డుకు బదలాయించింది. కానీ ఇన్నేళ్లుగా కంటోన్మెంట్ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకోలేకపోయారు. తాజాగా ఈ మైదానాన్ని అభివృద్ధి చేయాలని బోర్డు అధికారులు నిర్ణయించారు. మైదానాన్ని చదును చేసి, వివిధ క్రీడలకు సంబంధించిన సదుపాయాల కల్పనకు పూనుకుంటుండగా మిలటరీ అధికారులు (ఎల్ఎంఏ) ఆ స్థలం మాదంటూ బోర్డు ప్రయత్నాలకు అడ్డుపడుతున్నారు.

హెచ్‌సీఏ ఆక్రమణలో జింఖానా..

జీఎల్ఆర్ సర్వే నెంబర్ 712లోని 28 ఎకరాల్లో జింఖానా మైదానం ఉంది. ఇందులో సుమారు 8 ఎకరాలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సాప్)కు అప్పగించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఇక్కడ పలు క్రీడలకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగానే కొనసాగుతున్నాయి. ఒక మిగిలిన 20 ఎకరాల్లో 5.71 ఎకరాలను ప్రైవేటు సంస్థ అయిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు లీజుకు ఇచ్చారు. 1996లో నాటి ప్రధాని పీవీ నర్సింహరావు ఆదేశాలతో ఈ లీజు రద్దు అయింది. హెచ్‌సీఏ యాజమాన్యం కోర్టుకెళ్లడంతో డిఫెన్స్ ఎస్టేట్స్ అధికారులు స్వాధీనం చేసుకోవడంలో జాప్యం జరుగుతూ వచ్చింది. అయితే ఈ స్థలంలో కంటోన్మెంట్‌కు బదలాయించినప్పటికీ, బోర్డు అధికారులూ ఎలాంటి చర్యలు చేపట్టలేకపోయారు. హెచ్‌సీఏ మరో పదెకరాల స్థలాన్ని సైతం తమ కబ్జాలోకి తీసుకుంది. తాజాగా బోర్డు అధికారులు తమ స్థలాన్ని ఖాళీ చేయడంతో పాటు 30 ఏళ్లుగా దుర్వినియోగం చేసినందుకు రూ.100 కోట్లు చెల్లించాలంటూ నోటీసులు జారీ చేశారు. కోట్లాది రూపాయల విలువైన ఈ స్థలంలో సైతం స్థానికులు ఉపయోపడేలా క్రీడా సదుపాయాలు కల్పించాలని భావిస్తున్న బోర్డు అధికారులకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి.

హాకీ గ్రౌండ్‌లదీ అదే కథ..

మడ్‌ఫోర్ట్, రసూల్‌పురాలో కంటోన్మెంట్ స్థలాల్లో హాకీ మైదానాలు ఉన్నాయి. ప్రైవేటు ఫంక్షన్‌లకు పార్కింగ్, వివిధ ఈవెంట్‌ల నిర్వహణకు తప్ప, క్రీడాకారులకు ఏ విధంగానూ ఉపయోగపడటం లేదు. మడ్‌ఫోర్ట్‌లోని 8 ఎకరాల హాకీ మైదానం స్థలాన్ని తమకు అప్పగిస్తే క్రీడా సదుపాయాలు కలిస్తామని రాష్ట్ర ప్రభుత్వం పదే పద విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ పదేళ్లుగా కంటోన్మెంట్ నుంచి ఎలాంటి స్పందన లేదు. తాజాగా స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్ విజ్ఞప్తి మేరకు బోర్డు అధికారులు స్పందించినప్పటికీ, సానుకూల నిర్ణయం మాత్రం వెలువడటం లేదు. హాకీ మైదానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.23 కోట్లు వెచ్చించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినుట్లు తెలుస్తోంది. ఈ విషయంలో బోర్డు అధికారుల స్పందన ఆధారంగా చర్యలుంటాయని సమాచారం. బొల్లారం గార్డెన్స్‌లో క్రికెట్ మైదానాన్ని సైతం ఆర్మీ ఆక్రమించడం శోచనీయం.

పెంచిన ఫీజులను ప్రభుత్వమే భరించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: పెంచిన ఇంజినీరింగ్ కోర్సుల ఫీజుల భారాన్ని ప్రభుత్వం భరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ బుధవారం డిమాండ్ చేశారు. విద్యార్థులపై పెంచిన ఫీజుల భారాన్ని వేయడంతో అనేక మంది పేద విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక పథకాలు, ఉచితాలతో లక్షల కోట్ల సంపదను ప్రజలకు అందజేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల ఫీజులు భరించలేరా అని ప్రశ్నించారు. బీసీలకు 20 ర్యాంక్‌లోపు నిబంధనను ఎత్తివేయాలన్నారు.

పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి కొండా సురేఖ

సనత్‌నగర్: భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాల నేపథ్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) పోస్టర్‌ను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నదులను పరిరక్షించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఎస్‌యూపీ) నిషేధించడం, సక్రమంగా వ్యర్థాల నిర్వహణ చేపట్టడం వంటి వాటిపై ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన రావాలన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రజా రవాణాను వినియోగించడం ద్వారా వాహన కాలుష్యం, వాహన రద్దీ తగ్గుతుందన్నారు. పర్యావరణం కాపాడడం, పుష్కరాల పవిత్రతను కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో సత్తా



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ కొమురయ్య

సనత్‌నగర్: సీబీఎస్ఈ పదో తరగతి, 12వ తరగతి ఫలితాల్లో సనత్‌నగర్ హిందూ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 269 మంది విద్యార్థులు పరీక్ష రాయగా వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. చేతన కర్నూల్ 500 మార్కులకు గాను 498 (99.6 శాతం) జష్మిత వైభవి 490 మార్కులు (98 శాతం), మల్లం శరణ్య 484 మార్కులు (96.8 శాతం), కురుబ ప్రియనాగశ్రీ 484 (96.8)లతో ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. 12వ తరగతిలో మొత్తం 15 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు బి.శ్యాంసుందర్‌గౌడ్, ప్రిన్సిపాల్ రాధిక అభినందనలు తెలిపారు.

కంటోన్మెంట్‌లో..

కంటోన్మెంట్: నాణ్యమైన బోధన, విద్యార్థుల కఠోర దీక్షతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యం అవుతాయని డీపీఎస్ విద్యా సంస్థల వైస్ చైర్మన్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. సీబీఎస్ఈ పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన డీపీఎస్ మహేంద్రాహిల్స్ తొలి బ్యాచ్ విద్యార్థులను ఆయన అభినందించారు. తమ పాఠశాలలో విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో తమ సృజనాత్మకతను వెలికి తీసేలా బోధన సాగిస్తామన్నారు. తొలి బ్యాచ్‌లోనే తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. తమ విద్యార్థి సుమన 98.2 శాతం, జాహ్నవి 97.6 శాతం, వైసుమన 97 శాతం మార్కులు సాధించినట్లు తెలిపారు. మొత్తం 103 మంది విద్యార్థులకు గానూ 42 మంది 90 శాతానికి పైగా, 62 మంది విద్యార్థులు 80 శాతానికి పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉన్నతమైన విద్యాప్రమాణాలు పాటిస్తూ, బోధన సాగిస్తుండం వల్లే ఇలాంటి ఫలితాలు సాధ్యం అవుతున్నాయన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో సాయివర్ధన్‌కు స్వర్ణం

రసూల్‌పురా: బిహార్ రాజ్‌గిరిలో జరుగుతున్న ఖేల్ ఇండియా యువజన క్రీడల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున వెయిట్‌లిఫ్టింగ్‌లో పాల్గొన్న కంటోన్మెంట్ కార్ఖానకు చెందిన 17 ఏళ్ల సాయివర్ధన్ 89 కిలోల విభాగంలో ప్రతిభను కనబరచి స్వర్ణం సాధించాడు. సాయివర్ధన్ తండ్రి జవాజి శివకుమార్ కూడా అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ కావడం విశేషం. తండ్రి శిక్షణతో పాటు ఔరంగబాద్‌లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో ప్రఖ్యాత కోచ్ విజయ్ రొయిలా పర్యవేక్షణలో శిక్షణ పొందిన సాయివర్ధన్ పతకాన్ని సాధించడం విశేషం. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఖేలో ఇండియాలో యువ క్రీడాకారులలకు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు అద్భుతమైన వేదికగా నిలుస్తోందని శివకుమార్ తెలిపారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ శిబిరంలో పాల్గొన్న డీఐ శ్రీనివాస్

సనత్‌నగర్: వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బేగంపేట పోలీస్‌స్టేషన్ డీఐ శ్రీనివాస్ సూచించారు. అప్సా గ్రూప్ ఆధ్వర్యంలో బేగంపేట పాటిగడ్డలోని ఎస్‌బీటీనగర్‌లో వారం రోజుల పాటు జరిగే వేసవి శిక్షణ శిబిరాన్ని బుధవారం డీఐ ప్రారంభించి మాట్లాడారు. చిన్నతనంలోనే లక్ష్యాలను ఏర్పరచుకుని ఆ దిశగా కష్టపడాలన్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. వేసవి శిక్షణ శిబిరాలు ఎంతోమంది జీవితాలను మలుపు తిప్పాయని, వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీధర్, ఎస్‌బీటీనగర్ అధ్యక్షుడు శేఖర్‌ముదిరాజ్, అప్సా గ్రూప్ కోఆర్డినేటర్ బసవరాజ్, ఏరియా ఇన్‌చార్జి రాజేశ్వరి, శోభ, కృష్ణ, సల్మాన్, నసీం, శోభ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జూలై 13న లష్కర్ బోనాలు

సనత్‌నగర్: వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని నిసికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయ ఈఓ. గుత్తా మనోహర్‌రెడ్డి, పండితులతో కలిసి లష్కర్ బోనాల తేదీలను వివరించారు. జూన్ 29న అమ్మవారి ఘటాల ఊరేగింపు, జూలై 13న లష్కర్ బోనాలు, 14న రంగం (భవిష్యవాణి) ఉంటుందన్నారు.

మామిడి సీజన్

సికింద్రాబాద్ మార్కెట్లలో ఎటు చేసినా మామిడికాయలే కనిపిస్తున్నాయి. పచ్చళ్లు పెట్టుకునే సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్లతో పాటు వారాంతపు సంతల్లోనూ వీటి విక్రయాలు జోరందుకున్నాయి. మోండా, బోయిన్‌పల్లి వంటి ప్రధాన కూరగాయల మార్కెట్‌లతో పాటు అన్ని కూరగాయల మార్కెట్‌లలో పచ్చడి మామిడికాయలు అందుబాటులో ఉంచుతున్నారు. వివిధ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నుంచి కూడా పచ్చడి మామిడికాయలు నగరానికి దిగుమతి అవుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. – సికింద్రాబాద్




రైల్వే ఎఫ్ఓబీపై చైన్‌స్నాచింగ్

సనత్‌నగర్: రైలెక్కేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై వెళ్తుండగా ఓ మహిళ మెడలోని 26 గ్రాముల బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని పరారైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. శేరిలింగంపల్లి కొండాపూర్ టీజీఎస్‌పీ 8వ బెటాలియన్ పాత క్వార్టర్స్‌లో నివాసముండే పాతకోకల కుమారి (34) సనత్‌నగర్‌లోని ఎలికో హెల్త్‌కేర్ సర్వీసెస్‌లో ఉద్యోగం చేస్తుంది. విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో మంగళవారం రాత్రి 7.21లకు భరత్‌నగర్ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. హైటెక్ సిటీకి వెళ్లడానికి టికెట్ తీసుకుని మరోవైపు ఉన్న ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఎదురుగా వచ్చి ఆమె మెడలోని బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వంతెన నిర్మాణ పనుల్లో కదలిక



ఇటీవల ఆలుగడ్డబావి వద్ద వివరాలు సేకరిస్తున్న కమిషనర్ కర్ణన్



ఆర్‌యూబీ నిర్మించనుంది ఈ వంతెన పక్కనే..

సికింద్రాబాద్: జీహెచ్ఎంసీ, రైల్వే సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆలుగడ్డబావి రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) పనుల్లో కదలిక వచ్చింది. రెండు రోజుల క్రితం కమిషనర్ కర్ణన్ ఈ ప్రాంతంలో పర్యటించి ఆలుగడ్డబావి వంతెన నిర్మాణం పనులు త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు. ఈ క్రమంలో అప్రమత్తమైన జీహెచ్ఎంసీ అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. 2022 జనవరిలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇక్కడ ఆర్‌యూబీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మెట్టుగూడ–చిలకలగూడ చౌరస్తా మార్గంలో ఆలుగడ్డబావి వద్ద నిర్మించనున్న వంతెన నిర్మాణం కోసం రూ. 30 కోట్ల నిధులు కేటాయించారు. జీహెచ్ఎంసీ, రైల్వే అధికారులు సంయుక్తంగా వంతెనను నిర్మించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పలు సాంకేతిక సమస్యలు ఎదురవడం, ఆ తర్వాత ఎన్నికలు రావడం దరిమిశా వంతెన నిర్మాణం పనులు ప్రారంభించడం కోసం ముహూర్తం కలిసి రాలేదు. కొత్త కమిషనర్ నగరంలో విస్తృత పర్యటనలు చేస్తూ రహదారులను విస్తరించడం, కూడళ్లను ఆధునీకరించడం, బస్‌బేలు ఏర్పాటు చేయడం ద్వారా అటు ప్రయాణికులకు, ఇటు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా త్వరతితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నారు. కమిషనర్ ఆదేశం మేరకు నెల రోజుల్లో వంతెన నిర్మాణం పనులు ప్రారంభించేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఆర్‌యూబీ నిర్మాణం, సమాంతరంగా సమాంతర విశాలమైన రహదారి ఏర్పాటు కోసం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసుకున్నారు. ఆలుగడ్డబావి ఆర్‌యూబీ నిర్మాణం పూర్తయితే ఈ రహదారి ఫోర్‌వే రహదారిగా మారనుంది. తద్వారా సికింద్రాబాద్ చిలకలగూడ కూడలి నుంచి మెట్టుగూడ, తార్నాక మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి.